చురుగ్గా హైవే సుందరీకరణ



గ్రీన్‌బెల్ట్‌లో అందంగా కనిపిస్తున్న రంగులు వేసిన మొక్కలు



కాకానినగర్ వద్ద జాతీయ రహదారిలో డివైడర్లను బాగుచేస్తున్న కార్మికులు

- మెరిసేలా రోడ్లు, డివైడర్లకు రంగులు
- మరింత అందంగా గ్రీన్‌బెల్ట్‌లు



గ్రీన్‌బెల్ట్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు



మర్రిపాలెం వుడా లేఅవుట్ గ్రీన్‌బెల్ట్ వాకింగ్ ట్రాక్‌లో అందంగా పరిసరాలు, ఆధునిక విద్యుత్ లైట్లు

గోపాలపట్నం: ఈ నెల 28, 29 తేదీల్లో నిర్వహించనున్న జీ20 సదస్సుకు విశాఖ ముస్తాబవుతోంది. ముఖ్యంగా ఎయిర్‌పోర్టు నుంచి నగరంలోకి వెళ్లే జాతీయ రహదారిలో సుందరీకరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇక్కడి గ్రీన్‌బెల్ట్‌లో చెట్లకు జాతీయ రంగులు అద్ది అందంగా తీర్చిదిద్దుతున్నారు. కాకానినగర్ వద్ద హైవే గ్రీన్‌బెల్ట్‌లో చెత్తను తొలగించి కొత్త మట్టిని వేస్తున్నారు. రహదారి సెంటర్ డివైడర్‌కు రంగులు వేస్తున్నారు. జాతీయ రహదారిని ఆధునికీకరిస్తున్నారు. మర్రిపాలెం వుడా లేఅవుట్ వద్ద గ్రీన్‌బెల్ట్‌లో ఉన్న వాకింగ్ ట్రాక్‌ను మరింత అభివృద్ధి చేశారు. ఇందులో కొత్తగా విద్యుత్ లైట్లు ఏర్పాటు చేశారు. జాతీయ రహదారి సుందరీకరణ, గ్రీన్‌బెల్ట్‌ల అభివృద్ధితో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సకాలంలో 'నాడు–నేడు' పనుల పూర్తి

- డీఈవో చంద్రకళ ఆదేశం



విద్యార్థుల వర్క్‌బుక్స్‌ను పరిశీలిస్తున్న డీఈవో చంద్రకళ

విశాఖ విద్య: ప్రభుత్వ పాఠశాలల్లో నాడు–నేడు అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేసేలా శ్రద్ధ తీసుకోవాలని డీఈవో ఎల్.చంద్రకళ ఆదేశించారు. నగరంలోని పలు స్కూళ్లల్లో శుక్రవారం ఆమె ఆకస్మిక తనిఖీలు చేశారు. గోపాలపట్నం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల–1లో జరుగుతున్న నాడు–నేడు పనులను పరిశీలించారు. పనులన్నీ ప్రారంభించి, సకాలంలో పూర్తి చేసేందుకు కృషి చేయాలని వార్డు ఇంజినీరింగ్ అసిస్టెంట్‌కు డీఈవో సూచించారు. మధ్యాహ్న భోజన పథకం తయారీ విధానాన్ని పరిశీలించి, నిర్వాహక ఏజెన్సీ వారితో మాట్లాడారు. రుచికరంగా నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందించాలని సూచించారు. పాఠశాల రికార్డులను, విద్యార్థుల వర్క్‌బుక్స్‌ను పరిశీలించారు. తరగతుల్లో డీసీఆర్, వీసీఆర్ వినియోగం చకపోవడాన్ని గుర్తించిన ఆమె వీటిని క్రమం తప్పకుండా ఉపయోగించి రికార్డుల్లో నమోదు చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. పాఠశాల గేటు వద్ద చేపల దుకాణదారులు వ్యర్థాలు వేస్తున్నట్లు గమనించిన డీఈవో.. దీనిపై తగు చర్యల నిమిత్తం జోనల్ కమిషనర్‌తో ఫోన్‌లో చర్చించారు. ఏరియా శానిటరీ ఇన్‌స్పెక్టర్, మహిళా పోలీసు ద్వారా గోపాలపట్నం ఎస్‌ఐ దృష్టికి సమస్యను తీసుకెళ్లి, పాఠశాల గేటు వద్ద వ్యర్థాలు పడేయకుండా దుకాణదారులతో మాట్లాడాలన్నారు. ఇటువంటి వ్యర్థాల వల్ల విద్యార్థులు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందని, దీనిపై సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది జోక్యం చేసుకోవాలని డీఈవో చంద్రకళ సూచించారు.

క్లుప్తంగా

కనుల పండువగా పల్లకీ సేవ



నూకాంబిక అమ్మవారి పల్లకీ సేవలో మళ్ల ధనలత, భక్తులు

మల్కాపురం: కొత్త అమావాస్యను పురస్కరించుకుని జీవీఎంసీ 60వ వార్డు ఇందిరా కాలనీలో కొలువుదీరిన నూకాంబిక అమ్మవారి నెల పండగ ముహూర్తపు రాట పూజలు శుక్రవారం చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు, స్థానిక మహిళలు, అమ్మవారి మాల ధారణలో ఉన్న భక్తులు ప్రత్యేక పూజలు అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ఉంచి తిరువీధి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కనక మహాలక్ష్మి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యురాలు మళ్ల ధనలత, ఆలయ కమిటీ ప్రతినిధులు డి.శంకర్, గురుస్వామి ప్రకాష్, రవి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ్‌నగర్ గెడ్డలో పూడిక తీత



శ్రీరామ్‌గర్ గెడ్డలో పూడిక తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు

సాక్షి ఎఫెక్ట్..

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు శ్రీరామ్‌నగర్ గెడ్డలో పారిశుధ్య కార్మికులు పూడిక తీత పనులు చేపట్టారు. శుక్రవారం సాక్షి దిన పత్రికలో గెడ్డల నిర్వహణ ఘోరం అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. వెంటనే పారిశుధ్య కార్మికులతో గెడ్డను శుభ్రం చేయించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యుత్ సబ్సిడీపై నాయీ బ్రాహ్మణుల వినతి



ఏఈ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందిస్తున్న నాయీ బ్రాహ్మణుల సంఘం ప్రతినిధులు

మల్కాపురం: కుల వృత్తిలో భాగంగా ఏర్పాటు చేసుకున్న సెలూన్ షాపులకు విద్యుత్ బిల్లులో సబ్సిడీ వర్తించేలా చర్యలు తీసుకోవాలని శ్రీహరిపురం సబ్‌స్టేషన్ ఏఈ శ్రీనివాసరావుకు పారిశ్రామిక ప్రాంత నాయీ బ్రాహ్మణుల సంఘం జేఏసీ ప్రతినిధులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పి.సూర్యారావు, రామకృష్ణ, లోవరాజు మాట్లాడుతూ తమ ఆర్థిక కష్టాలను గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సెలూన్ షాపులకు విద్యుత్ బిల్లులో సబ్సిడీ ఇచ్చారన్నారు. అయితే తమలో కొంత మందికి మాత్రం ఆ సబ్సిడీ వర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఏఈని కలిసి వినతిపత్రం అందజేశామని, ఆయన సానుకూలంగా స్పందించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని సంఘం ప్రతినిధులు తెలిపారు.

ఆర్టీసీ బస్ ఢీకొని సెక్యూరిటీ గార్డు మృతి

అల్లిపురం: ఆర్టీసీ బస్ ఢీకొని సెక్యూరిటీ గార్డు మృతి చెందిన ఘటన టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వన్‌టౌన్ కొత్తరోడ్డు ప్రాంతానికి చెందిన అండిబోయిన కోటేశ్వరరావు(60) సిరిపురం జంక్షన్‌లో గల ఖరాచీవాలాలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం 9 గంటల సమయంలో స్కూటీపై విధులకు బయలుదేరాడు. పూర్ణామార్కెట్ నుంచి సీపీ కార్యాలయం జంక్షన్ వైపు వస్తుండగా, 28వ నంబర్ ఆర్టీసీ బస్సు అతనిని బలంగా ఢీకొట్టడంతో ఆయనకు బలమైన గాయాలయ్యాయి. దీంతో ట్రాఫిక్ కానిస్టేబుల్‌తో కలిసి ఆర్టీసీ బస్ సిబ్బంది గాయపడిన కోటేశ్వరరావును కేజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ అతను మరణించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



ఫ్రైడే–డ్రైడేపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

సింథియా: జీవీఎంసీ 62వ వార్డు ఏఎస్సార్ కాలనీ, ఎన్టీఆర్ కాలనీల్లో శుక్రవారం సచివాలయ సిబ్బంది, వార్డు మలేరియా నివారణ విభాగం సంయుక్తంగా ఫ్రైడే–డ్రైడేపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మలేరియా టెక్నికల్ సూపర్‌వైజర్ భవానీ, మల్కాపురం ఏరియా మలేరియా ఇన్‌స్పెక్టర్ రవికుమార్‌లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. సీజనల్ వ్యాధుల కట్టడికి అధికారులు, జీవీఎంసీ సిబ్బంది, వార్డు సచివాలయ సిబ్బంది అహర్నిశలు శ్రమిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం తీసుకునే చర్యలను దృష్టిలో పెట్టుకుని ప్రజలు తమ వంతు సహకారాన్ని అందించి నగరాన్ని సీజనల్ వ్యాధుల రహితంగా తీర్చిదిద్దాలని కోరారు. ఇంటింటికీ వచ్చే పారిశుధ్య కార్మికులకు చెత్తను తడి, పొడిగా వేరు చేసి అందజేయాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతోనే వ్యాధులను నివారించవచ్చన్నారు. ప్రజలందరూ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు ఉంచకుండా.. ప్రతి మంగళ, శుక్రవారాల్లో డ్రైడే పాటించాలన్నారు. డెంగ్యూ కారక దోమలు మంచినీటిలోనే ఉత్పన్నమవుతాయని, మూడు రోజులకు ఒకసారి నీటి నిల్వలను మార్చుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో పాత టైర్లు, తాగి పాడేసిన కొబ్బరిబొండాలు, మూతలు లేని సీసాలను ఉంచరాదన్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధుల ఆరోగ్యంపై జాగ్రత్తగా ఉండాలని, ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తినా వెంటనే వైద్యులను సంప్రదించాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో మల్కాపురం మలేరియా నివారణ సూపర్‌వైజర్ దుల్లా శ్రీనివాసరావు, హెల్త్ సెక్రటరీ రమ్య, ఆశ కార్యకర్తలు, జీవీఎంసీ సిబ్బంది, వలంటీర్లు, స్థానికులు పాల్గొన్నారు.

రేపటి నుంచి నూకాంబిక జాతర ఉత్సవాలు



జాతర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు, సంఘ సభ్యులు

సింథియా: జీవీఎంసీ 62వ వార్డు టీడీపీ కాలనీలో వెలసిన నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర మహోత్సవాల వాల్‌పోస్టర్‌ను శుక్రవారం కాలనీ అభివృద్ధి సంఘం సభ్యులతో కలిసి కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ఆవిష్కరించారు. అంబేడ్కర్ కాలనీలోని కార్పొరేటర్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు మాట్లాడుతూ ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకు అమ్మవారి జాతర ఉత్సవాలను అత్యంత ఘనంగా జరిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. నూకాంబిక గ్రామ కమిటీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు శేఖర్, గౌరవాధ్యక్షుడు రమణ, కార్యదర్శి దుర్గారావు, కోశాధికారి విజయ్‌పూర్ణ, సభ్యులు సింహాద్రి, రామయ్య, అల్లాబాబు, శ్రీనివాసరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కర్ణాటక గాత్ర కచేరీ



కీర్తనలు ఆలపిస్తున్న అరుణమణి, గాయత్రి

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో శుక్రవారం నిర్వహించిన కర్ణాటక గాత్ర కచేరీ ఆహుతులను అలరించింది. ఎస్.శ్రీవిద్య శిష్యులు ఎస్.అరుణమణి, కె.గాయత్రి సుమద్యుతి మృదు మధుర గానంతో అన్నమయ్య, త్యాగరాజ, ముత్తుస్వామి దీక్షితార్ కీర్తనలు ఆలపించి ప్రేక్షకులను వీనులవిందు చేశారు. సిద్ధిం దేహి మే, లలితా పంచకం, సర్వ మంగళాధవ, కమలాప్తకుల, మాయమ్మ అలమేలు మంగ శ్రీగురుగుహ, వలపులు వలపులు, హరి నీప్రతాపము, జయ జయ దుర్గే, జయజయ జయహే కీర్తనలు శ్రావ్యంగా పాడారు. వీరికి ఎస్.కృష్ణప్రియ వయోలిన్‌పై, టి.ఎస్.చైతన్య మృదంగంపై వాద్య సహకారం అందించారు. అనంతరం గాయకులను లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ సత్కరించారు. ఏకాదశి సందర్భంగా శనివారం ఉదయం 5 గంటలకు లలితా పీఠంలో కల్యాణ శ్రీనివాసుడికి సుప్రభాత సేవ, 6 గంటలకు విశేష అభిషేకం జరుగుతాయని ఆయన చెప్పారు.

సర్వీస్ రోడ్లపైకి దుకాణాలు



శాంతిగిరి కాలనీకి వెళ్లే సర్వీస్ రోడ్డులో వెలసిన దుకాణం

మల్కాపురం: సర్వీస్ రోడ్లు వ్యాపారాలకు అడ్డాగా మారుతున్నాయి. జీవీఎంసీ 59వ వార్డు పాత చెక్‌పోస్ట్ ఏరియా నుంచి శాంతిగిరి కాలనీకి వెళ్లే మార్గం(గాజువాక ఆర్టీసీ డిపో ఎదురుగా ఉన్న సర్వీస్ రోడ్డు)లో సుమారు 30 వాణిజ్య దుకాణాలు ఉన్నాయి. వీటిని వివిధ వ్యాపారులు అద్దెకు తీసుకుని ఫాస్ట్‌ఫుడ్, టెంట్‌హౌస్, చికెన్, కిరాణ, పాన్‌షాప్‌లు నిర్వహిస్తున్నారు. ఇక్కడి సర్వీస్ రోడ్డుకు ఆనుకుని ఉన్న ఫుట్‌పాత్‌ను గానీ, దానిని దాటి గానీ వ్యాపారాలు సాగించకూడదు. అయితే చాలా మంది వ్యాపారులు ఫుట్‌పాత్‌లను ఆక్రమించడమే కాకుండా వాటిని దాటి సర్వీస్ రోడ్డుపైకి వచ్చి దర్జాగా తమ వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. దీంతో ఇటువైపు రాకపోకలు సాగించే వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు దృష్టిసారించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

త్వరలో మిస్ అండ్ మిసెస్ ఉత్తరాంధ్ర పోటీలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు మంచ నాగమల్లేశ్వరి తదితరులు

సీతంపేట: రైతులు, చేనేత కళాకారులకు చేయూత నివ్వాలన్న సంకల్పంతో న్యూ హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మిస్ అండ్ మిసెస్ ఉత్తరాంధ్ర–2023 పోటీలు నిర్వహిస్తున్నట్టు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ మంచ నాగమల్లేశ్వరి తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్లు శుక్రవారం పౌరగ్రంథాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనే వారు ఏప్రిల్ 10వతేదీ లోగా 73370 97256, 73964 44404 ఫోన్ల నంబర్లలో సంప్రదించి నమోదు చేసుకోవాలని సూచించారు. కన్జ్యూమర్ రైట్స్ కమిషన్ నేషనల్ ఛైర్మన్ డాక్టర్ సాయి రమేష్, రాష్ట్ర అదనపు కార్యదర్శి సురేష్‌నాయుడు, 2022 మిసెస్ ఉత్తరాంధ్ర విన్నర్ కొణతాల భాగ్య, మిస్ విశాఖ విన్నర్ గౌతమి, ఫౌండేషన్ డైరెక్టర్ సిద్ధు పాల్గొన్నారు.

ఎంవీఐపై దాడికి నిరసన



రవాణా శాఖ కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న అధికారులు, సిబ్బంది

గోపాలపట్నం: కాకినాడలో ఎంవీఐ చిన్నారావుపై జరిగిన దాడిని ఖండిస్తూ విశాఖపట్నం రవాణా శాఖ కార్యాలయం వద్ద ఆ శాఖ అధికారులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రవాణా శాఖ కమిషనర్ రాజారత్నం మాట్లాడుతూ అధికారులపై దాడి చేయడం చాలా దారుణమని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు.

నేడు సర్వసభ్య సమావేశం

మల్కాపురం: ది హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ కాంట్రాక్టర్ లేబర్ కో–ఆపరేటివ్ సొసైటీ సర్వసభ్య సమావేశం 58వ వార్డు కోరమాండల్ సమీపంలోని వైష్ణవి ఫంక్షన్ హాల్‌లో శనివారం సాయంత్రం జరగనుంది. 2022 సెప్టెంబర్ నుంచి 2023 మార్చి వరకు సొసైటీ జమా ఖర్చులు, అగ్రిమెంట్, డివిడెండ్లు, ఇతర సమస్యలపై చర్చ జరుగుతుందని సొసైటీ పాలక వర్గ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి సొసైటీ కార్మికులంతా తప్పక హాజరు కావాలని వారు కోరారు.

ఆడారి ఆనంద్‌కుమార్ పర్యటన నేడు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో శనివారం వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ పర్యటించనున్నారు. 61వ వార్డు మాజీ కార్పొరేటర్ దివంగత దాడి సూర్యకుమారి నివాసం(ఆర్కే పురం) వద్ద జరిగే వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. అనంతరం సీనియర్ జర్నలిస్ట్ ప్రసాద్‌రాజును పరామర్శించనున్నారు.

విస్టం విద్యార్థుల ప్రతిభ

సింహాచలం : నరవలోని విశాఖ ఇంజినీరింగ్ కళాశాలలో ఇటీవల జరిగిన మెక్ ఉత్సవ్ 2క23 క్రీడా పోటీల్లో విస్టం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కబడ్డీలో విజేతలుగా, వాలీబాల్‌లో రన్నర్స్‌గా నిలిచారు. సత్తా చాటిన విద్యార్థులను కళాశాల మెంటార్ జేమ్స్‌స్టీఫెన్, వైస్ ప్రిన్సిపాల్ జాషువా, పీడీ రమణారావు అభినందించారు.

వేడుకగా అప్పన్న నిత్య కల్యాణం



యజ్ఞోపవీత ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 గంటల నుంచి 10.30 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకులు శ్రీకాంత్ తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

సాఫ్ట్‌వేర్ కంపెనీ స్థాపనే ధ్యేయం

- కార్పెంటర్ కుమారుడికి గేట్‌లో 13వ ర్యాంక్
- పేదరికాన్ని జయించి.. లక్ష్యాన్ని సాధించిన సాయి
- ఐఐఎస్‌సీ బెంగళూరులో చేరేందుకు ఆసక్తి



తల్లి సరోజినితో 13వ ర్యాంకర్ సాయి

సబ్బవరం: ప్రతిభకు పేదరికం అడ్డు కాదని మరోసారి నిరూపించాడు పండూరి సాయి. ఆర్థిక ఇబ్బందులను అధిగమించి, గేట్‌లో 924 మార్కులతో ఆలిండియా 13వ ర్యాంక్ సాధించాడు. ఐఐఎస్‌సీ బెంగళూరులో పీజీ చేసి, సాఫ్ట్‌వేర్ కంపెనీ స్థాపించడం లక్ష్యమని తెలిపాడు. ఇంటర్ పరీక్షకు ఫీజు కూడా కట్టలేని పరిస్థితుల నుంచి గేట్‌లో ర్యాంక్ సాధించేందుకు అతను పడిన తపన, చేసిన శ్రమ నేటి యువతకు స్ఫూర్తిదాయకం. సాయి విజయగాథ అతని మాటల్లోనే..

ప్రాథమిక విద్య ప్రభుత్వ పాఠశాలలోనే..

మాది ఆరిపాక శివారు పెదయాతపాలెం. మా నాన్న పండూరి వెంకటరావు వడ్రంగి. అమ్మ సరోజిని, గృహిణి. మేము ముగ్గురం సంతానం. నాకు ఒక అక్క, చెల్లి ఉన్నారు. 1 నుంచి 5వ తరగతి వరకు మా స్వగ్రామం పెదయాతపాలెంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నా. తర్వాత పదో తరగతి వరకు విశాఖలోని బంధువుల ఇంటి వద్ద ఉంటూ ప్రైవేట్ పాఠశాలలో చదివాను.

ఆర్థిక ఇబ్బందులతో ఇంటర్‌లో చేరలేక..

టెన్త్ తర్వాత ఇంటర్ చదివేందుకు ఆర్థిక ఇబ్బంది కలిగింది. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రికల్‌లో డిప్లొమో పూర్తి చేశాను. తర్వాత ఈ సెట్‌లో 8వ ర్యాంక్ సాధించి, ఆంధ్ర యూనివర్సిటీలో ఇంజినీరింగ్ పూర్తి చేశాను. పోటీ పరీక్షల ద్వారా ఉద్యోగం సాధించి, ప్రస్తుతం ఒడిశాలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌లో గ్రేడ్ 1 ఆఫీసర్‌గా పని చేస్తున్నాను.

టాప్ ఇన్‌స్టిట్యూట్‌లో చదవాలని..

దేశంలోని టాప్ ఇన్‌స్టిట్యూట్‌లో చదవాలని లక్ష్యంగా పెట్టుకుని గేట్‌కు ప్రిపేర్ అయ్యాను. రోజుకు 14గంటలు ప్రిపేర్ అయ్యేవాడిని. అనుకున్నట్లుగానే మంచి ర్యాంక్ వచ్చింది. ఈ ర్యాంక్‌కు డీఆర్‌డీఏ, బార్క్, ఇస్రో వంటి సంస్థల్లో చేరవచ్చు. కానీ ఐఐఎస్సీ బెంగళూర్‌లో ప్రవేశం పొందడం ద్వారా నా కలను సాకారం చేసుకోవాలనుకుంటున్నా. ఎంటెక్‌లో వీఎల్‌ఎస్‌ఐ స్పెషలైజేషన్ చేసి, మంచి సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రారంభించడమే లక్ష్యం.

అమ్మ, నాన్నల కష్టాలను తీర్చాలి

అమ్మ, నాన్న పడిన ఇబ్బందులు చూస్తూ పెరిగాను. ఒక రకంగా మా ఆర్థిక ఇబ్బందులే నా పట్టుదలను పెంచాయి. ఎంత కష్టమైనా ఇష్టంతో చదివాను. ర్యాంక్ రాగానే అమ్మ, నాన్నలతో ఆ ఆనందాన్ని పంచుకున్నా. వారికి ఏ కష్టం లేకుండా చూసుకోవాలని కోరిక.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశం

దొండపర్తి: టెక్ మహీంద్రా ఫౌండేషన్ సహకారంతో నిర్మాణ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ అందించి ఉపాధి కల్పించనున్నట్లు నిర్మాణ్ సంస్థ డైరెక్టర్ మయూర్ పట్నాల తెలిపారు. ఇంటర్ పాస్, డిగ్రీ పూర్తయిన 18 నుంచి 28 ఏళ్లలోపు ఉన్న వారు అర్హులన్నారు.

టైపింగ్ స్కిల్స్, ఎంఎస్ ఆఫీస్, ఇంటర్నెట్ కాన్సెప్ట్స్, కమ్యూనికేటివ్ ఇంగ్లిష్, హెచ్‌టీఎంఎల్, సీఎస్ఎస్, ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్, టెక్నికల్ స్కిల్స్, బేసిక్ అకౌంటింగ్ స్కిల్స్ కోర్సుల్లో 3 నెలల పాటు శిక్షణ ఉంటుందని వెల్లడించారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఎస్‌పీడీ సమీప బాజీ జంక్షన్‌లో గల నిర్మాణ్ ఆర్గనైజేషన్ కేంద్రంలో గానీ, 95028 74304, 99081 04113 ఫోన్ నంబర్లలో ఈ నెల 18వ తేదీలోగా సంప్రదించాలని సూచించారు.

